క్లుప్తంగా

పశువుల టీకాల సరఫరాపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: న్యూయానిమల్ డిసీస్ కంట్రోల్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం దేశంలో పశువుల నోటి, పాదం జబ్బులకు సంబంధించిన టీకాలను రాష్ట్రాలకు సకాలంలో సరిపడా సరఫరా, ప్రస్తుత, గత రెండు సంవత్సరాల్లో రాష్ట్రాలకు అందించిన టీకాల గురించి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నలేవనెత్తారు. కేంద్ర మత్స్య, పశు సంరక్షణ, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్షోత్తం రూపాల సమాధానం ఇస్తూ టీకాల డోసులను అన్ని రాష్ట్రాలకు కేంద్రం కోరిక మేరకు అందిస్తోందన్నారు. 2020–21లో 23.02 కోట్ల టీకాలు, 2021–22లో 97.38లక్షల టీకాలు, 2021–22లో 97.37లక్షల టీకాలు, 2022–23లో 63.25 లక్షల టీకాలు సరఫరా చేయడం జరిగిందన్నారు. టీకా డోసుల వేగవంత సరఫరాకు కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి అభ్యర్థనలు రాగా అవసరమైన టీకా డోసులు సకాలంలో అందించడం జరిగిందని, దేశంలో వీటి కొరత ప్రస్తుతం లేదని మంత్రి వివరించారు.

అదానీ వ్యవహారాన్ని ప్రశ్నించినందుకే కేసులు

ఒంగోలు టౌన్: అదానీ ఆర్థిక కుంభకోణాన్ని ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సైదా గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కర్ణాటక ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రచారం చేయకుండా అడ్డుకునేందుకే బీజేపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. న్యాయస్థానాలన్నా, రాజ్యాంగం అన్న కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉందని, గత ఎనిమిదేళ్లలో మోదీ, అమిత్‌షాలు అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా విమర్శలు చేస్తున్న మోదీ, అమిత్‌షాలకు వందల సంవత్సరాల జైలు శిక్ష విధించినా సరిపోదన్నారు.

పొగాకు కొనుగోళ్లు

ఒంగోలు రూరల్: రూరల్ లోని త్రోవగుంట వేలం కేంద్రం–2లో 709 బేళ్లు రాగా 578 బేళ్లు కొనుగోళ్లు జరిగాయి. 79 బేళ్లు నోబిడ్ బేళ్లు కాగా గరిష్ట ధర రూ.200 కాగా కనిష్ట ధర రూ.170 పలికింది. సరాసరి ధర రూ.195.23 గా నమోదైనట్లు వేలం కేంద్రం–2 నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

రాగిజావ కోసం 100 గ్లాసుల పంపిణీ


పాఠశాలలో రాగి జావ కోసం గ్లాసులను అందిస్తున్న సుధాకర్‌సూరి

చీమకుర్తి: ఆర్.ఎల్.పురంలోని ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రాగిజావ తాగేందుకు అవసరమైన 100 స్టీల్ గ్లాసులను కరస్పాండెంట్ వై.సుధాకర్‌సూరి సమకూర్చారు. గురువారం పాఠశాలలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దయామణి చేతుల మీదుగా అందించారు. ప్రభుత్వం జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో అందిస్తున్న రాగి జావ తాగేందుకు ఈ గ్లాసులను సద్వినియోగం చేసుకోవాలని సుధాకర్‌సూరి కోరారు.

ఎన్‌ఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

గుడ్లూరు(కందుకూరు): మండలంలోని బసిరెడ్డిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన దోర్నీల వర్షిని ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు సలీంబాష తెలిపారు. 8వ తరగతి చదువుతున్న వర్షిని జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణ సాధించి మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని, సంవత్సరానికి రూ.12వేల స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు.

వలేటివారిపాలెం: ఆదర్శ పాఠశాల ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు తెలిపారు. మండలంలోని చుండి గ్రామ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు బోడా నవ్యశ్రీ, ప్రగడ రాకేష్, చెరువుపల్లి కృతిక సాయి కోటిలు స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

హనుమంతునిపాడు: జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని ముప్పాళ్లపాడులో జగన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పనులు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులు పరిశీలించారు. పనులు నాణ్యతలో తేడా లేకుండా చూడాలన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యదర్శులు, ఏఈలు కొండయ్య అఖిలున్నారు.


జగనన్న కాలనీలలో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు

అభివృద్ధి వైపు దశరాజుపల్లె

- మారుతున్న రూపు రేఖలు
- గత ప్రభుత్వ హయాంలో అన్ని అవస్థలే..

ఒంగోలు రూరల్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఒంగోలు మండలంలో దశరాజుపల్లె గ్రామం గతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దశరాజుపల్లె వెళ్ళాలంటే ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. అనారోగ్యం ఏర్పడితే ఒంగోలు వెళ్లి ఆటో తీసుకుని రావాల్సిందే. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థతో గ్రామం అభివృద్ధిలో ముందుకు పోతోంది. నవరత్నాల్లో భాగమైన పేదలందరికీ గృహ వసతి కల్పించేందుకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేసి, సచివాలయ సిబ్బంది గుర్తించిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు రాజకీయ వర్గాలకు అతీతంగా ఇచ్చారు. గతంలో రోజుల తరబడి ఒంగోలు వెళ్ళి కాళ్లు అరిగేలా వివిధ ధ్రువీకరణ పత్రాలు, పట్టదారు పాస్ పుస్తకాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కష్టపడాల్సి వచ్చేది. కానీ నేడు పంచాయతీ భవనం స్థానే సచివాలయ భవనం ఏర్పాటు చేయడం అందులో రెవెన్యూ, వెల్‌ఫేర్, మహిళా సంక్షేమ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్స్, సర్వేయర్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను నియమించారు. గతంలో రెండు అడుగుల లోతు గోతులమయంగా ఉండే కొత్తపట్నం– ఒంగోలు రోడ్డు మార్గం ఆధునిక టెక్నాలజీతో బాలినేని ఆదేశాలమేరకు వేగంగా పూర్తి చేస్తున్నారు. సమీపంలోని కరవది మేజర్ సాగర్ కాలువ నుంచి గ్రామ చెరువుకు నీరు నింపుకునే అవకాశం ఏర్పడడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెరిగి పంటలు మంచి దిగుబడులను అందిస్తున్నాయి. త్వరలో పూర్తి కానున్న రైతు భరసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ ద్వారా ప్రస్తుతం అద్దె భవనాల్లో విధులు నిర్వర్తిస్తున్న శాశ్వత భవనంలోకి మారె అవకాం ఉంది. రైతు భరోసా కేంద్రం ద్వారా భూసార పరీక్షలు, ఎరువులు తదితర వివరాలు అందజేస్తున్నారు. అలాగే సబ్సిడీపై ఎరువులు మందులు అందజేయడమే కాకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం, శనగ కొనుగోలు చేయడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. సాగర్ కాలువ కింద వరి మంచి దిగుబడిని అందిస్తోంది. శనగ విస్తారంగా వేసిన నేపథ్యంలో మంచి దిగుబడులు లభించాయి. చెత్త నుంచి సంపద కేంద్రం ఎస్‌డబ్ల్యూఎస్ కేంద్రం పిల్లర్స్ పోసి వేగంగా నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం ముదిగుండి సమీపంలో ఓ డంపింగ్ యార్డులో చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద వర్మీకంపోస్టు చేయాల నేదే గ్రామ సర్పంచ్ ప్రణాళిక అని వైస్సార్ సీపీ నాయకుడు చంద్రోఖర్‌రెడ్డి తెలిపారు.


రైతు భరోసా కేంద్రం నిర్మాణం


నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం

పర్యావరణంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

అల్లూరు (కొత్తపట్నం): రైతులు జాతీయ సేవా పథకం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని డాట్ సెంటర్ ఒంగోలు ప్రధాన శాస్త్రవేత్త, సమన్వయ కర్త డాక్టర్ పి.రాజశేఖర్ అన్నారు. అల్లూరులో బాపట్ల వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం గురువారం ప్రారంభించారు. రాజశేఖర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం కార్యక్రమం వారం రోజులు పాటు నిర్వహించే కార్యక్రమంలో రోజుకొక కార్యక్రమం ఉంటుందన్నారు. కలుపు మొక్కల నివారణ మొదలైన విషయాలు గురించి వివరించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఆఫీసర్ డాక్టర్ ఎం. రవిబాబు మాట్లాడుతూ విద్యార్థులు, గ్రామస్తులు సహకారంతో స్వచ్ఛ భారత్ కలుపు మొక్కల నివారణ, పశువైద్య శిబిరం, ఆరోగ్య శిబిరం, నిల్వ ధాన్యాలలో తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డాట్ సెంటర్ శాస్త్ర వేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాద్‌రావు, డాక్టర్ జి. రమేష్ మాట్లాడుతూ గ్రామీణ పని అనుభవ కార్యక్రమాలు, జాతీయ సేవా పథకం, ప్రాముఖ్యత గురించి వివరిస్తామన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్, రిప్రజంటేటివ్ డాక్టర్ విజయ్‌కుమార్, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఉప సర్పంచ్ టి.సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, మండల వ్యవసాయాధికారి బీవీ మోహన్‌రెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ శోభ, హెచ్‌ఎం శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



నాగేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిపాడు: మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన సీనియర్ పార్టీ నాయకుడు మండవ నాగేశ్వరరావు మృతదేహానికి మండల నాయకులు గురువారం నివాళులర్పించారు. నందిపాడుకు చెందిన మండవ నాగేశ్వరరావు పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో పని చేస్తున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డిలు నాగేశ్వరరావు ఆత్మ శాంతించాలని ప్రార్థించారు. వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, మద్దిపాడు మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నందిపాడు సర్పంచ్ శ్రీకాంత్, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు పూనాటి అప్పారావు బాల చంద్రమౌళి, దాసు, రామాంజనేయులు, రమణమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు ప్రారంభం


కొలనకోట సచివాలయంలో పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మద్దిపాడు: చిరుధాన్యాల ప్రాధాన్యత తల్లులకు వివరిస్తూ కొలచనకోట గ్రామంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ ఆధ్వర్యంలో పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన మునగ ఆకుతో కూరలు చేసే విధానం గురించి వివరించారు. పలు చిరు ధాన్యాలు వాటి వలన కలిగే ఉపయోగాలు వివరించారు. గురువారం లింగగుంట, బసవన్నపాలెంలో కార్యక్రమం నిర్వహించినట్లు సీడీపీఓ ఇవాంజలిన్ తెలిపారు. శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయచంద్రమణి విజయ నిర్మల జీఎంఎస్‌కే కరుణ, అనురాధ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏరువాక కేంద్రం ఒంగోలులోనే కొనసాగించాలి


మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం–ఏరువాక కేంద్రాన్ని ఒంగోలులోనే కొనసాగించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం భవన్ ముందు వామపక్ష, రైతు సంఘాల నేతలతో కలిసి సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏరువాక కేంద్రాన్ని మారుస్తున్నారన్న సమాచారం తమకు అందిందన్నారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలోని రైతాంగానికి ఎంతో ప్రయోజనం ఉందని తెలిపారు. దేశంలోనే వాణిజ్య పంటలు అధికంగా పండించే జిల్లాగా ప్రకాశం ముందు వరుసలో ఉందన్నారు. పత్తి, పొగాకు, మిరప పంటతో పాటు అనేక రకాల పంటలు పండుతున్నాయన్నారు. అలాగే మొక్క జొన్నతో పాటు నూతన వంగడాలు, అధికోత్పాదనకు మేలైన యాజమాన్య పద్ధతులు, చీడ పీడల నివారణ చర్యలు గురించి సమాచారం అందిస్తున్నారని వెల్లడించారు. వర్షాభావం, అధిక తేమ, అధిక వర్షాలకు గురయిన సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలు లాంటి సమాచారాలు ఈ కేంద్రాన్ని మారిస్తే ప్రమాదకరమన్నారు. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌తో పాటు వ్యవసాయ శాఖ మంత్రికి కూడా వినతిపత్రం ఇచ్చామన్నారు. రైతు సంఘాల నేతలు వడ్డే హనుమారెడ్డి, పమిడి వెంకటరావు, చుంచు శేషయ్య, ఎస్.లలిత కుమారి, మండవ శ్రీనివాసరావు, పెంట్యాల హనుమంతరావు, కె.వీరారెడ్డి, ఉప్పుటూరి ప్రకాశం, జుజ్జూరి జయంత్ బాబు, మారెళ్ళ సాయి, బోడావుల లక్ష్మీ నారాయణ, చుండూరి శ్రీరామమూర్తి, ఆళ్ళ శ్రీమన్నారాయణ, మన్నం నాగేశ్వరరావు, రావిపాటి మల్లీశ్వరరావు, పావులూరి అంజయ్య పాల్గొన్నారు.

95 మద్యం బాటిళ్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం

పీసీపల్లి: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానికంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై నాగేశ్వరరావు సిబ్బందితో సోదాలు చేసి చెరుకుపల్లి సాయికృష్ణను అరెస్టు చేసి అతని వద్ద 85 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయం తనిఖీ

వెలిగండ్ల: గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని తనిఖీ అధికారి బి. కోటేశ్వరి అన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2018–19 నుంచి 2021–22 సంవత్సరాల వార్షిక తనిఖీలో భాగంగా గ్రంథాలయంలోని పుస్తకాలను, గ్రంథాలను, దిన, వార, మాస పత్రికలను, రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరి మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథపాలకుడు భాస్కర్, పాఠకులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.కోటేశ్వరి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కందుకూరు రూరల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను గురువారం అందజేశారు. వలేటివారిపాలెం మండలం పోలినేని పాలెం పంచాయతీ 10వ వార్డుకు మెంబర్ ఎడ్లూరి ఆంజనేయులు పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. హెచ్ఎం అనూరాధ మాట్లాడుతూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు మహాల్యాలారావు, పెరుగు ప్రసాదరావు, చిత్తూరు వెంకటేశ్వర్లు బొల్లా రవిబాబు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన


పూజలు చేస్తున్న బాబూరావు కుటుంబ సభ్యులు

సీఎస్‌పురం(కనిగిరి): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, దత్త సాయిబాబా మందిర నిర్మాణాలకు గురువారం వైభవంగా శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు తన సొంత నిధులతో మండలంలోని సీఎస్‌పురం, కోవిలంపాడు గ్రామాల మధ్యలో మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి సమీపంలో కళ్యాణ వెంకటేశ్వర స్వామి, దత్త సాయిబాబా ఆలయాలను నిర్మిస్తున్నారు. ఇందుకోసం గురువారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య కదిరి బాబూరావు కుటుంబ సభ్యులు ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. కదిరి బాబూరావు సోదరులు ప్రకాశరావు, పార్థసారథి, బాలకృష్ణ, చందనా పట్టాభిరామేశ్వరరావు, సుంకరి వెంకటాద్రి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలు



అమరుడు భగత్ సింగ్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు


భగత్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఒంగోలు టౌన్: అమరవీరుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు చేయనున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి పురస్కరించుకొని గురువారం స్థానిక 60 అడుగుల రోడ్డులో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. అమరవీరుడి చిత్ర పటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్పొరేట్ మతోన్మాద నిరంకుశ శక్తుల చేతుల్లో నలిగిపోతున్న భారత దేశాన్ని విముక్తి చేయడానికి ప్రజలను సమీకరిస్తామని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు చేకూర్చుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ విధానాలు నిరుపేద సామాన్య ప్రజలకు తలమించిన భారంగా తయారయ్యాయని మండిపడ్డారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ దోపిడీ వ్యతిరేకిస్తూ ప్రజలు సమసమాజ నిర్మాణానికి కదం తొక్కాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల చేత ప్రతిజ్ఞ చేయించారు. దారా వెంకటేశ్వర్లు, కె. గురుస్వామి, సి.కోటేశ్వరరావు, ఎం.నారాయణ, టి. వీరయ్య, రాజేశ్వరీ దేవి, విజయకుమార్, కాలేషా, రమణారెడ్డి పాల్గొన్నారు.

చీమకుర్తి: భగత్ సింగ్‌కు గురువారం చీమకుర్తిలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయు నాయకులు, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన స్వాతంత్ర్య సమరంలో చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. పూసపాటి వెంకట్రావు, జేవీవీ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ్‌పై గర్భిణులకు అవగాహన


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ, సూపర్‌వైజర్

చీమకుర్తి: అయ్యపరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భిణులు, బాలింతలకు పోషణ్ పక్వాడ్ కార్యక్రమంపై సీడీపీఓ ఇవాంజలిన్, సూపర్‌వైజర్ పి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలు, బాల్యవివాహాలతో కలిగే అనర్థాల గురించి వివరించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీ కృష్ణయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్ ఆకస్మిక తనిఖీ


ఎంపీపీ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీవో అజయ్‌బాబు

మదనూరు (కొత్తపట్నం): స్థానిక స్వర్ణాంధ్ర పట్టపుపాలెం ఎంపీపీ స్కూల్‌ను ఎంఈఓ బి.అజయ్ బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాలుగో ఫార్మాటివ్ మూల్యాంకన పరీక్ష జవాబు పత్రాలను, విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. ఇంగ్లీష్ సబ్జెక్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ పిల్లలకు సాంకేతిక పరమైన విద్యను అభ్యసించాలని, ప్రతి విద్యార్థిని వ్యక్తిగత ఆలోచన విధానాలు వెలుగు తీయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుడు కె.నీరజా రత్నం, కె.కిషోర్ కుమార్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ కె.శ్రీదేవి, అకౌంటెంట్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభ ఏర్పాటుకు పూజలు


పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: రామతీర్థం గంగమ్మ జాతర సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రభ నిర్మాణాన్ని ఆకాంక్షిస్తూ జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏప్రిల్ 5న రామతీర్థంలో నిర్వహించే గంగమ్మ తిరునాళ్ళలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున విద్యుత్ ప్రభను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మన్నం శ్రీధర్, కౌన్సిలర్‌లు బడే అయ్యపరెడ్డి, సోమా శేషాద్రి, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కూరాకుల సుబ్బారెడ్డి , కూడలి మాలకొండయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీడీసీఏ అధ్యక్షునిగా వివేకానంద

ఒంగోలు: ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా తాను , కార్యదర్శిగా పుల్లంశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా కత్తి కిషోర్‌కుమార్ ఎంపికై నట్లు మొగిలిశెట్టి వివేకానంద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా జిల్లావ్యాప్తంగా పదిమంది సభ్యులను కూడా ఎన్నుకుంటామన్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.వీరరాఘవరెడ్డి, వై.రామకృష్ణారెడ్డి, సీహెచ్.శ్రీనివాసులు, ఎన్.బ్రహ్మయ్య, కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా జి.నారాయణరెడ్డి, వై.రాజశేఖర రెడ్డి, ఎం.బాలవెంకటేశ్వర్లు, ఈసీ మెంబర్‌గా కె.వెంకట బదుల, జీబీ సభ్యులుగా టి.కాశిరెడ్డి, కె.అశ్విన్ కుమార్ రెడ్డిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈమేరకు నూతన కార్యవర్గ వివరాలను జిల్లా రిజిస్ట్రార్‌కు కూడా అందజేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ ప్రకటనను గమనించి అసోసియేషన్ తమది అని గమనించాలన్నారు. అసోసియేషన్ తమది అంటూ క్రీడాకారుల వద్ద డబ్బులు వసూలు చేసేవారితో జాగ్రత్తగా ఉండాలని, అన్ని ఏజ్ గ్రూప్ సెలక్షన్స్ త్వరలో పత్రికాముఖంగా తెలియజేస్తామని మొగిలిశెట్టి వివేకానంద పేర్కొన్నారు. 7013260949 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762 90102 02856

Office mail : sakshiongads@gmail.com